## క్లుప్తంగా

### మండల ఆర్టిస్టు కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**కొల్లాపూర్ రూరల్:** కొల్లాపూర్ మండల స్థాయి ఆర్టిస్టు అసోసియేషన్ కమిటీని శనివారం కొల్లాపూర్‌లో ఆర్టిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్ సింగ్, అధ్యక్షుడిగా యండీ షఫీ, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కురుమూర్తి, కోశాధికారిగా జి.కురుమూర్తి, సలహాదారులుగా రవిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కమిటీ ఆర్టిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆర్టిస్టులు పాల్గొన్నారు.

### మొక్కు తీర్చుకున్న కార్యకర్త

**పెద్దకొత్తపల్లి:** దేవల్‌తిరుమలాపూర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు గెలిచి మంత్రి పదవి వస్తే 101 కొబ్బరికాయలు కొడుతా అని కుర్మయ్య అనే కార్యకర్త శనివారం దేవాలయం వద్ద 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నాడు.

### రామాలయానికి మరమ్మతు

**కొల్లాపూర్:** పట్టణంలో పాతబస్టాండ్ ప్రాంతంలోని రామాలయానికి స్వల్ప మరమ్మతులు చేపట్టారు. ఆలయం ప్రహరీతో పాటు, ఇతర గోడలకు ఉన్న గచ్చును తొలగించి, సిమెంట్ పనులు చేపట్టారు. దాతల సహకారంతో పనులు చేస్తున్నామని, భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వెల్లడించారు.

### 11న కార్తీక మాస పూజలు

**కొల్లాపూర్:** పట్టణంలోని మాధవస్వామి దేవాలయంలో ఈ నెల 11న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ విజయ్‌కుమార్ వెల్లడించారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయంలో సామూహిక వ్రతాలు, సాయంత్రం లక్ష దీపార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పూజలకు భక్తులు హాజరుకావాలని కోరారు.

### వన భోజనాలు



**ఉప్పునుంతల:** మండల కేంద్రంలో శనివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మహిళలు కార్తీక వన భోజనాల కార్యక్రమం చేపట్టారు. గ్రామ సమీపంలోని వ్యయసాయ పొలంలోని మామిడి తోటలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం అక్కడే చెట్ల కింద వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

### ఎంపీపీకి ఘన సన్మానం



**పెద్దకొత్తపల్లి:** శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు గెలుపుకోసం కృషి చేసిన ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌ను వెన్నచర్లలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎల్లయ్య, సురేష్, వీరస్వామి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవికుమార్, పర్వతాలు, శంకర్ ఉన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన బలాన్‌పల్లి వాసులు



**తాడూరు:** మండలంలోని బలాన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని శనివారం కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో 30 ఏళ్లుగా కాంగ్రెస్‌కు అధికారం లేక కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని, తమకు అండగా ఉండి తమ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, బాలస్వామి, సీపీఐ నేత వనంపల్లి జైపాల్‌రెడ్డి, సురేష్ తదితరులు కోరారు.

### చెరువునీటి విడుదల

**కల్వకుర్తి రూరల్:** మండలంలోని తోటపల్లిలో రైతుల ప్రయోజనం కోసం సర్పంచ్ శ్రీలత చెరువు నీటిని విడుదల చేశారు. రైతుల పంటలు కాపాడాలనే లక్ష్యంతో చెరువు నీటిని విడుదల చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రజుమంలో రాజేష్‌రెడ్డి, వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు సాగేదెట్లా?

- వంతకు గంతేసినట్లు క్రీడా ప్రాంగణాల ఏర్పాటు
- నీరుగారిపోతున్న ప్రభుత్వ లక్ష్యం
- పాఠశాలల్లో ఉన్న కొద్దిపాటి ఆట స్థలాలకే క్రీడా ప్రాంగణాలుగా బోర్డులు

**ఉప్పునుంతల:** గ్రామీణ యువతకు క్రీడలపై ఆసక్తి పెంచడానికి ఉద్దేశించిన తెలంగాణ క్రీడా ప్రాంగణాల పరిస్థితి మండలంలో వంతుకు గంతేసినట్లు ఉంది. గ్రామ సమీపంలో ప్రభుత్వ స్థలాలు లేకపోవడం, ఉన్నతాధికారులు ఒత్తిడితో మండల స్థాయి అధికారులు చేసేది లేక స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కొద్దిపాటి ఆట స్థలంలోనే క్రీడా ప్రాంగణాలుగా బోర్డులు తగిలించి చేతులు దులుపుకొన్నారు. మరికొన్ని గ్రామాల్లో చెరువు శిఖం భూముల్లో, ఆటలు ఆడుకోవడానికి అనువుగా లేని స్థలాల్లో నామమాత్రంగా క్రీడా ప్రాంగణాలుగా చూపించి బోర్డులు ఏర్పాటు చేశారు. మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలాలు ఎంపిక చేసి బోర్డులు మాత్రం పెట్టారు. దాదాపుగా ఎక్కువ గ్రామపంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఆట స్థలాలనే క్రీడా ప్రాంగణాలుగా ఎంపిక చేశారు. మండలంలోని మర్రిపల్లిలో గ్రామసమీపంలోని చెరువు శిఖం భూమిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో చెరువు నిండితే క్రీడా ప్రాంగణం నీట మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. సీబీ తండాలో క్రీడా ప్రాంగణం కోసం ఎంపిక చేసిన స్థలం బండరాళ్లతో కూడి అనువుగా లేని స్థలంలో బోర్డును పెట్టారు. లక్ష్మాపూర్, సూర్యతండాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కొద్దిపాటి ఇరుకు స్థలంలోనే క్రీడా ప్రాంగణాలుగా ఎంపిక చేశారు. ఉప్పునుంతల జెడ్పీహెచ్ఎస్, పెనిమిళ్ల జెడ్పీహెచ్ఎస్‌లోని ఆట స్థలాలనే క్రీడా ప్రాంగణాలుగా చూపిస్తున్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయడానికి రూ.93 లక్షలు మంజూరు కాగా.. ఇప్పటి వరకు 21 గ్రామ పంచాయతీల్లో కేవలం రూ.12 లక్షలు మాత్రమే ఖర్చు చేసి ఎంపిక చేసిన స్థలాల్లో కొంతమేర మొరం చల్లించారు. 6 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు ఏమాత్రం క్రీడా ప్రాంగణాల అభివృద్ధి పనులు ప్రారంభించలేదు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో పాటు యువకులు ఆడుకోవడానికి ప్రభుత్వం నుంచి క్రికెట్ కిట్లు, వాలీబాల్, డంబెల్స్ తదితర అన్ని రకాల ఆట వస్తువులు వచ్చి మండల కార్యాలయంలో కొన్ని నెలలు ఉన్న తర్వాత గ్రామపంచాయతీలకు అప్పగించారు. ప్రస్తుతం గ్రామపంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్నాయి.




మర్రిపల్లిలో చెరువు శిఖం భూమిలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం

### స్థలాలు అందుబాటులో లేకనే..



గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల కోసం ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకనే ఇబ్బందిగా ఉంది. దాంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో తప్పనిసరి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న స్థలాలను ఎంపికచేసి మట్టి, మొరం పోయించి ఆట స్థలాలను అభివృద్ధి చేయడానికి కృషిచేస్తున్నాం. ఆటలకు సంబంధించిన అన్ని కిట్లు గ్రామపంచాయతీల్లో యువతకు అందుబాటులో ఉంచాం.

– లక్ష్మణ్‌రావు, ఎంపీడీఓ, ఉప్పునుంతల

# 'మహాలక్ష్మి' జర్నీ షురూ



అచ్చంపేట ఆర్టీసీ బస్టాండ్‌లోని ప్రయాణికులు

**కోడేరు/అచ్చంపేట రూరల్:** మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని శనివారం నుంచి అమలు చేశారు. జిల్లాల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, నగరాల్లో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభమైంది. జిల్లాలోని నాలుగు ఆర్టీసీ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. ఆయా డిపో పరుధుల్లో ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణించే వారికి ప్రయాణ పరిధి విషయంలో ఎలాంటి పరిమితులుండవని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అంతర్ రాష్ట్ర సర్వీసులకు తెలంగాణ పరిధిలో మాత్రమే ఉచిత ప్రయాణం వర్తిస్తుందని వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ వేగం పెంచింది. మహాలక్ష్మి పేరిట ప్రారంభించిన పథకం ద్వారా మహిళలు, విద్యార్థులకు, ట్రాన్స్‌జెండర్లకు టికెట్ రాయితీ వర్తింపజేశారు. కొత్త పథకంతో మహిళలకు ఉపశమనం లభించినా అచ్చంపేట ఆర్టీసీ డిపోకు ప్రతి రోజు రూ.5.60లక్షల చొప్పున నెలకు రూ.1.68కోట్ల భారం పడనుంది.

### ఆనందంగా ఉంది

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు పథకాలు అమలు చేయడం సంతోషంగా ఉంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఆరోగ్య శ్రీ, బీమా పథకం కింద రూ.10 లక్షల వరకు వైద్యసేవలు అందించడం సంతోషం.

– చంద్రమ్మ, కోడేరు

# ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

**అచ్చంపేట రూరల్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట వేసిందని, వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలవుతాయనే నమ్మకం ఉందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సతీమణి, అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ అన్నారు. శనివారం అచ్చంపేటలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు రాష్ట్రంలో నలుమూలల ఉచితంగా ప్రయాణం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి అవకాశం కల్పించారన్నారు. మహిళా లోకం హర్షిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మురళీదుర్గాప్రసాద్, కౌన్సిలర్లు గౌరీశంకర్, సునితారెడ్డి, చిట్టెమ్మ, నూరిబేగం, మహిళా నాయకురాళ్లు శారదమ్మ, సుశీల, ఆర్టీసీ సిబ్బంది ఏజే రెడ్డి, మోహన్‌లాల్, ఇందిరమ్మ పాల్గొన్నారు.



అచ్చంపేటలో ప్రారంభిస్తున్న అనురాధ

# ఉచిత బస్సు ప్రయాణంపై హర్షం



కొల్లాపూర్‌లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభోత్సవలో మున్సిపల్ కౌన్సిలర్లు



చారకొండలో మహిళలు, నాయకులు

**కొల్లాపూర్:** కొల్లాపూర్‌లో ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని మున్సిపల్ కౌన్సిలర్లు ప్రారంభించారు. మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మహిముదాబేగం, కౌన్సిలర్లు శ్రీదేవీ గౌతంగౌడ్, మేకల రమ్యకుమారి, పిన్నంశెట్టి జ్యోతి, మేకల శిరీషయాదవ్, బరిగెల శ్రీలక్ష్మీయాదవ్, నర్సింహరావు, రహీంపాష, డాక్టర్ రాముడు, నయూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొల్లాపూర్ నుంచి సింగోటం వరకు వారు బస్సులో ప్రయాణించారు. మహిళలకు ఆర్టీసీ కండక్టర్ జీరో టికెట్‌ను అందించారు. ఆర్టీసీ డీఎం బాలసరస్వతితో పాటు ఆర్టీసీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**చారకొండ:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల భాగంగా శనివారం సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించడంపై శనివారం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సును ఆపి ప్రయాణికులు, మహిళలు కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్, సీపీఐ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి వారికి సముచిత స్థానం కల్పించిందని అన్నారు. అదేవిధంగా సామాన్యులకు ఎంతో ఉపయోగకరమైన వైద్య సదుపాయాన్ని రూ.10లక్షలకు పెంచడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో బాల్‌రాం గౌడ్, వెంకట్ గౌడ్, శ్రీనివాసులు, శంకర్, అంజయ్య అశోక్ పాల్గొన్నారు.

**లింగాల:** మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అట్టహాసంగా ప్రారంభించారు.



లింగాలలో...

# హామీల అమలుపై సంబరాలు

**మన్ననూర్:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేస్తామన్న 6 గ్యారంటీల్లో రెండు పథకాలు తక్షణమే అమలు చేసిన సందర్భంగా కాంగ్రెస్ వర్గాలు సంబరాలు జరుపుకొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేది కాంగ్రెస్ పార్టీ అంటూ ఎంపీటీసీలు ఎంఏ రహీం, శ్రీనివాసులు ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. మన్ననూర్‌లో ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న అచ్చంపేట డిపో బస్సుకు మామిడాకుల తోరణాలు కట్టి బస్సు ముందు టపాసులు కాల్చి స్వీట్లు పంచుకుని సాగనంపారు. బుచ్చయ్య, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, శివాజీ, సత్యనారాయణ, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



మన్ననూర్‌లో తోరణాలు కట్టి సంబరాలు

# మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న సంబు శోభ

**మన్ననూర్:** సాధారణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ప్రత్యేకించి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంపై మహిళా లోకం తరపున మాజీ వైస్‌ఎంపీపీ సంబు శోభ వెంకటరమణ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. శనివారం గ్రామంలోని దర్గా వద్ద మహిళలతో కలిసి ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేసి ఫాతెహాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రెండు రోజుల్లోనే రెండు పథకాలు ఆచరణలో అమలు చేయడం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట మీద ఉండేదని రుజువు చేసుకుందని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో మహిళలు జయమ్మ, ప్రభావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### వంశీకృష్ణ గెలుపుపై ప్రత్యేక పూజలు

**మన్ననూర్:** అచ్చంపేట ఎమ్మెల్యేగా స్థానికుడు డాక్టర్ వంశీకృష్ణ గెలుపొందిన సందర్భంగా గ్రామ ప్రజలు ఊరు పొలిమేరలోని ప్రకృతి దేవతలకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లమల అటవీ లోతట్టు ప్రాంతం సార్లపల్లి గ్రామస్తులు పార్టీలకు అతీతంగా గ్రామం వెలుపల ఉన్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. డీజే చప్పుళ్ల నడుమ మహిళలు గొబ్బెమ్మలు, కోలాటం వేశారు.



# మహిళాభివృద్ధిలో కీలకం



ఆర్టీసీ ఉచిత ప్రయాణం ప్రారంభిస్తున్న బాలాజీ

**కల్వకుర్తి టౌన్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో మహిళా అభివృద్ధిలో కీలకం కానున్నాయని జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్ అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం కార్యక్రమాన్ని శనివారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సారాధ్యంలో ప్రజాప్రభుత్వం ప్రారంభమైందని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షలతో మహిళలకు, రైతులకు, ఉద్యోగులకు స్వర్ణయుగం రానుందన్నారు.

# క్లాస్‌మేట్ క్లబ్‌లో యువతకు చేయూత

**కందనూలు:** క్లాస్‌మేట్ క్లబ్ 12వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్ మాట్లాడారు. ఇప్పటివరకు 20 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు రూ.15 లక్షలకు పైగా, 40 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.25 లక్షలకుపైగా, ముగ్గురు ఎంసీఏ, ఐదుగురు ఎంబీఏ, ముగ్గురు సీఏ విద్యార్థులకు రూ.5 లక్షలు, ఇతర విద్యార్థులకు 1వ తరగతి నుంచి పీజీ వరకు తాత్కాలిక అవసరాలకు రూ.ఐదు లక్షలకుపైగా సాయం చేశామన్నారు. ఇలా క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో అన్ని రకాల విద్యార్థులకు 100 మందికి సుమారు రూ.50 లక్షల ఆర్థిక సాయం చేశామని చెప్పారు. అనంతరం కోడేర్‌కు చెందిన అగ్రికల్చర్ విద్యార్థిని శ్రావణి కుటుంబానికి రూ.5 వేల సాయం చేశారు. కార్యక్రమంలో బాదం శ్రీనివాస్, రమణ, కందూరి లక్ష్మణ స్వామి, కోదండ రాములు, శ్యాంసుందర్, పద్మావతి, సరిత, వెంకట్, రాజు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థిని శ్రావణి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

# ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం

**తెలకపల్లి:** ఆధ్యాత్మిక చింతనతోనే మానవుడికి ప్రశాంత జీవనం అందుతుందని హనుమాన్ గురుస్వామి రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో హనుమాన్ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. 25 రోజులుగా నియమనిష్టలతో, భక్తిశ్రద్ధలతో దీక్షలో ఉంటూ స్వామివారికి పూజలు చేస్తున్నారు. శనివారం 25 మంది స్వాములు పూజల అనంతరం మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి దర్శనానికి మండల కేంద్రం నుంచి పాదయాత్రగా బయలుదేరారు. స్వాములకు భక్తులు, కుటుంబసభ్యులు సాగనంపారు. కార్యక్రమంలో గురుస్వాములు రమేష్, ఎల్లస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రగా బయలుదేరిన స్వాములు

# ఘనంగా సోనియాగాంధీ జన్మదినం



తాడూరులో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ రోహిణి

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రాలు, పట్టణాలు, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు శనివారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. తెలంగాణ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయాన్ని అందించి సోనియాగాంధీకి బహుమతిగా ఇచ్చారన్నారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



అమ్రాబాద్‌లో...



పెద్దకొత్తపల్లి బస్టాండ్‌లో ..

### రోగులకు పండ్లు పంపిణీ



**కల్వకుర్తిరూరల్:** కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని తాండ్రకి చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మల్లేష్ గౌడ్, భాస్కర్ చారి, జయసింహారెడ్డి పలువురు ఉన్నారు.

### ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలి

**నాగర్‌కర్నూల్‌రూరల్:** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించారని, మహిళలతో పాటు దివ్యాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పుల్జాల బాలీశ్వర్, అధ్యక్షుడు కోట్ల గౌతమ్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక లేక ద్వార విజ్ఞప్తిని పంపారు. మానవతా కోణంలో ఆలోచించి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

### రక్షణ కల్పించాలని ఫిర్యాదు

**కొల్లాపూర్:** కొల్లాపూర్ పట్టణానికి చెందిన అవుట రాజశేఖర్ శనివారం కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో తనపై తప్పుడు కేసులు పెట్టిన, నమోదు చేసిన వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆయన ఏఎస్ఐ వెంకట్రాములుగౌడ్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. 2021 జూన్ 2న చేయని తప్పునకు తనపై తప్పుడు ఫిర్యాదులు స్వీకరించి, కులం పేరుతో దూషించి, విచక్షణా రహితంగా ఎస్ఐ బాలవెంకటరమణ దాడి చేశారని ఆరోపించారు. తనపై హత్యాయత్నం జరిగిందన్నారు. నా కుటుంబ సభ్యులను అసభ్యంగా దూషించిన, నాపై తప్పుడు ఫిర్యాదులు చేసిన వారి నుంచి నాకు ప్రాణహాని ఉందని, వారి నుంచి రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### రజక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**నాగర్‌కర్నూల్ రూరల్:** తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మూడో రాష్ట్ర మహాసభలు జనగామ జిల్లా కేంద్రంలో 2024 జనవరి 28న కొనసాగుతాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని రజక సంఘం నాయకులు గోవిందు బాలస్వామి, అంతారం సురేష్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మహాసభల్లో భవిష్యత్‌లో రజక సంఘం చేపట్టబోయే పోరాటాలపై చర్చిస్తామన్నారు. మహాసభలకు జాతీయ నాయకులు పాల్గొంటారని మహాసభలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

### పుస్తకాల అందజేత



**కల్వకుర్తి రూరల్:** మండలంలోని గుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. 10వ తరగతి చదివే విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతో మేలు చేస్తుందని క్లబ్ అధ్యక్షుడు రఘు అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్యకు స్టడీ మెటీరియల్ అందజేశారు.